నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 25 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

చదువు సాగట్లేదని విద్యార్థినుల ఆందోళన

టీచర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్

టేకులపల్లి, డిసెంబర్ 24 : టీచర్లు సమ్మె చేస్తుండడంతో మా చదువులు ముందుకు సాగడం లేదని టేకులపల్లి కేజీబీవీ విద్యార్థినులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిమన్యు మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేసే టీచర్లు, సిబ్బంది దాదాపు 15 రోజులుగా సమ్మె చేస్తుండడంతో విద్యార్థినుల చదువులు సాగని పరిస్థితి నెలకొన్నదన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు సిలబస్ పూర్తికాకపోవడం.. వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. డెయిలీ వైజ్ వర్కర్లు కూడా సమ్మెలో ఉండడంతో విద్యార్థినులకు

టేకులపల్లి కేజీబీవీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

సరిగ్గా భోజనం కూడా అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టీచర్లు, సిబ్బంది సమస్యలు పరిష్కరించి, విద్యార్థినుల తరగతులు సక్రమంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాదావత్ ఉదయ్, సింధు, మౌనిక, సుధ, ప్రవల్లిక, మధు, కల్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఘనత కేసీఆర్‌దే..

వాటిని అమలు చేయలేక కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సాంబాయిగూడెంలో బీఆర్ఎస్‌లోకి 20 కుటుంబాలు

సాంబాయిగూడెంలో బీఆర్ఎస్‌లో చేరిన వారితో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, డిసెంబర్ 24 : పదేళ్ల పాలనలో పేద, మధ్యతరగతి వర్గాలు, కూలీల కోసం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేశారని, కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక ప్రజలపై మోయలేని భారం మోపుతున్నదని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మండిపడ్డారు. సాంబాయిగూడెంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 20 కుటుంబాల వారు రేగా సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేశారని, వాటిని ఇప్పుడు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టత కోసం సమష్టిగా పని చేయాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, టౌన్ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, బొలిశెట్టి నవీన్, నుకర రమేశ్, రాంబాబు, ఎడ్ల శ్రీను, యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, ముద్దంగుల కృష్ణ, బర్ల సురేశ్, జక్కం రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దైవం మానవరూపమే క్రీస్తు

ప్రతి మానవుడు తప్పనిసరిగా, అత్యవసరంగా తెలుసుకోవాల్సిన అంశం దేవుడు. ప్రపంచంలోనే అతి ప్రాముఖ్యమైన సంగతి సైతం దేవుడే. ఇంతకీ దేవుడు ఎక్కడుంటాడు.. ఎలా ఉంటాడు.. ఆయన గుణగణాలు ఏమిటీ.. ఇలా ఎన్నో ఏళ్లుగా మనిషి అన్వేషణ చేస్తూనే ఉన్నాడు. కానీ.. ఎవరు కూడా దేవున్ని సంపూర్ణంగా తెలుసుకోలేకపోయారు.. వర్ణించలేకనూపోయారు. అందుకే ఆ అదృశ్య దేవుని దృశ్యరూపమైన క్రీస్తునాథుడే పరము నుంచి భువికి దిగొచ్చాడు. ముందుగా ప్రవక్తలచేత చెప్పిన విధంగానే కన్య మరియ గర్భాన జన్మించాడు. ఈ లోకమంతటికీ దేవుని శక్తిని, ఆయన లక్షణాలన్నింటినీ తెలియజేశాడు. పాపాలు చేసి దేవుడికి దూరమైన మానవజాతిని మళ్లీ దేవుని ఎదుట పరిశుద్ధులుగా నిలబెట్టేందుకు తన ప్రాణాన్ని సిలువలో పణంగా పెట్టాడు. మనిషికి, దేవుడికి మధ్య వారధిగా మారిన దైవరూపమే యేసుక్రీస్తు. ఆ క్రీస్తు జననమే క్రిస్మస్.

- ఖమ్మం, డిసెంబర్ 24

- పరము నుంచి భువికి దిగివచ్చిన పరమాత్ముడు
- మానవజాతికి ఏకైక రక్షకుడు యేసు ప్రభువు
- నేడు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముస్తాబైన చర్చిలు
- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ఆరాధనలు

విద్యుద్దీపాల వెలుగుల్లో టేకులపల్లి చర్చి

చిన్నారులతో కరచాలనం చేస్తున్న 'క్రిస్మస్ తాత' బాలుడు

కరుణామయుడు, ప్రేమ మయుడు, దయామయుడు యేసు క్రీస్తు జన్మదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఖమ్మం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చిలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవుల పండుగల్లో ప్రధానమైనది యేసుక్రీస్తు జన్మదినమైన డిసెంబర్ 25వ తేదీన జరుపుకునే క్రిస్మస్ పండుగ. నవంబర్ 25 నుంచే సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవుల షాపింగ్‌ల సందడి ముగిసింది. పండుగ వారంరోజుల ముందు నుంచే ఖమ్మం నగరంలో సందడి నెలకొంది. క్రిస్మస్ వేడుకల కోసం కేక్‌లు, స్వీట్లు ఆర్డర్ ఇచ్చేందుకు స్వీటు షాపులు కిటకిటలాడాయి. క్రైస్తవుల ఇళ్లపైన నక్షత్రం ఆకారంలో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు. అంతటా క్రిస్మస్ ట్రీలు, బెల్స్, బెలూన్లు, స్టార్లు, శాంతాక్లాజ్ స్టిక్కర్లు, పండుగ శుభాకాంక్షలు తెలిపే బోర్డులు, పశువుల పాకలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పశువుల పాకలో యేసు జననం..

నెలలు నిండిన కన్య మరియమ్మను ఏసోబు తన సొంత గ్రామమైన బేత్తెహాముకు తీసుకుని వెళ్తారు. కానీ.. వారికి ఆగ్రామంలో ఎక్కడా చోటు లభించదు. చివరికి ఒక పశువుల పాకలో తలదాచుకోవడానికి చోటు లభిస్తుంది. అప్పటికే నొప్పులు పడుతున్న మరియమ్మ చిన్నారి యేసుకు జన్మనిస్తుంది. ఆ బాల ఏసును పొత్తిగుడ్డల్లో చుట్టి పశువుల తొట్టిలో ఉంచుతారు. దేవుడు భూమిపై జన్మించాలనుకుంటే ఏ రాజు కోటలోనో, ధనవంతుల ఇళ్లల్లో జన్మించి ఉండవచ్చు. కానీ.. తాను సామాన్య మానవుల కోసం లోకానికి వచ్చాననే సందేశాన్ని ఇవ్వడానికి పశువుల పాకలో క్రీస్తు జన్మించాడని క్రైస్తవుల విశ్వాసం.

బహుమతుల శాంతాక్లాజ్..

మన దేశంలోని క్రిస్మస్ తాతనే పాశ్చాత్య దేశాల్లో శాంతాక్లాజ్‌గా పిలుస్తారు. క్రిస్మస్ తాత సంప్రదాయం మూడో శతాబ్దంలో ప్రాచుర్యంలోకి వచ్చింది. క్రిస్మస్‌కు ముందు రోజు రాత్రి క్రిస్మస్ తాత ఇంటింటికీ వెళ్లి బహుమతులను ఇంటి ముంగిట పెట్టి తలుపుకొట్టి వెళ్లిపోయేవాడని పాశ్చాత్య దేశాల్లో ప్రాచుర్యం ఉంది.

గంటల ప్రత్యేకత..

గడియారాలు లేని రోజుల్లో చర్చిల్లో సమయానుసారంగా మోగించే గంటలే ఊరంతటికీ సమయమెంతో తెలిపేవి. ముఖ్యంగా చర్చిలో ప్రార్థనలు, ఆరాధనల వేళల్లో గంటలు మోగగానే అందరూ హాజరయ్యేవారు. ప్రభువు సన్నిధికి తాము వెళ్లే సమయాన్ని సూచిస్తున్నందున గంటకు ప్రత్యేకత ఏర్పడింది.

అర్ధరాత్రి నుంచే ఆరాధనలు..

జిల్లాలో రోమ్ క్యాథలిక్ మిషన్(ఆర్‌సీఎం)కు చెందిన పలు చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ ఆరాధనలను ప్రారంభించారు. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి, నాయుడుపేట, ఖమ్మం నగరంలోని వైరారోడ్డు, శ్రీనివాసనగర్, మౌంట్‌ఫోర్టు, తల్లాడ, కల్లూరు, పాల్వంచ, కొత్తగూడెంలలోని ఆర్‌సీఎం చర్చిల్లో, భద్రాచంలోని సెయింట్ ఆన్స్ ఆర్‌సీఎం చర్చిల్లో రాత్రి 11 గంటల నుంచే క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభించారు. ప్రొటాస్టేన్స్ చర్చిలైన సెయింట్ మేరిస్, సీఎస్ఐ చర్చి, ఎన్ఎస్‌పీ క్యాంపులోని హోలీ ట్రీనిటీ చర్చి, ఇందిరానగర్‌లోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి, ఖానాపురం హవేలీలోని లివర్స్ చర్చి, కూసుమంచిలోని ఇమ్మాన్యూయేల్ చర్చి, కొత్తగూడెంలోని ఆంధ్రూస్ చర్చి, భద్రాచలంలోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి, పాల్వంచ, ఇల్లెందు, వైరా, రుద్రంపూర్, రామవరం, సత్తుపల్లిలోని సీఎస్ఐ చర్చిల్లో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి క్రిస్మస్ ఆరాధనలను నిర్వహించనున్నారు.

ఖమ్మంలో క్రిస్మస్ తాతలు, దేవ దూతల వేషధారణలో స్కూల్ విద్యార్థులు

'ముక్కోటి'కి పకడ్బందీ ఏర్పాట్లు

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, డిసెంబర్ 24 : ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు తగినట్లుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించ తలపెట్టిన ముక్కోటి ఏకాదశి ఉత్సవ ఏర్పాట్లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనం, తెప్పోత్సవం కార్యక్రమాలను వీక్షించేందుకు వచ్చే ప్రముఖులు, వీఐపీ, వీవీఐపీలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వైకుంఠ ద్వార దర్శనం తర్వాత స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఒక్కసారిగా వెళ్లే సమయంలో తొక్కిసలాట జరగకుండా రెవెన్యూ, పోలీసు శాఖలు పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. అనంతరం తెప్పోత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, వంటకాలు తెలియజేసేలా ప్రత్యేకంగా స్టాల్స్, స్టేజీ ఏర్పాటు చేసి ఈనెల 31 నుంచి గిరిజనుల కళా ప్రదర్శనలు ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. గోదావరి పరిసరాల్లో ఖాళీగా ఉన్న

ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ప్రదేశాల్లో ట్రైబల్ గ్రామాల్లోని పాతకాలపు గుడిసెలు తాత్కాలికంగా ఏర్పాటు చేసి పర్యాటకులకు సౌకర్యంగా ఉండేలా వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అనంతరం వికారాబాద్ జిల్లా జీవన్‌పేట నుంచి భద్రాచలం విహార యాత్రకు వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు ఇక్కడి దర్శనీయ స్థలాలను సందర్శించి.. ఆదివాసీల సంస్కృతిని తల్లిదండ్రులతో మళ్లీ వచ్చి వీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్‌రావు, ఆలయ ఈవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన సీఆర్టీల సమ్మె

పిల్లాపాపలతో ఐటీడీఏ ఎదుట దీక్షలో కూర్చున్న టీచర్లు

పిల్లలతో కలిసి సమ్మెలో పాల్గొన్న ఆశ్రమ పాఠశాలల టీచర్లు

భద్రాచలం, డిసెంబర్ 24 : తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల(సీఆర్టీ) సంఘం ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 5వ రోజుకు చేరింది. దీక్షలో తమ పిల్లాపాపలతో కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు శివకుమార్ మాట్లాడుతూ సీఆర్టీలకు వెంటనే మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసులను క్రమబద్ధీకరించి ప్రతినెలా ఒకటో తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. సీఆర్‌టీల సమ్మెకు టీపీటీఎఫ్ మాసపత్రిక సంపాదకులు మునిగడప రామాచారి, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రమోహన్, టీడబ్ల్యూటీయూ రాష్ట్ర నాయకుడు మోహన్‌లాల్, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజ్మీరా శివనాయక్, రాష్ట్ర నాయకులు రూప్లానాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పసుపులేటి శ్రీను, రవికుమార్, లక్ష్మణ్‌నాయక్, మంగీలాల్, వీరన్న, జిల్లా అధ్యక్షుడు సక్రాంనాయక్, వీరన్న, హరిరాం, రాందాస్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

కూరగాయలు విక్రయిస్తూ.. శ్రీరాముడికి వినతిపత్రం ఇస్తూ..

ఖమ్మం, భద్రాద్రిలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన

15వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె

భద్రాద్రి రాముడి ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 24 : తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరుకుంది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు. దీంతో తమ ఆందోళనను మరింత ఉధృతం చేసిన ఉద్యోగులు.. రోజుకో రీతిలో వినూత్నంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద చేపట్టిన ఆందోళనలో భాగంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలిపారు. భద్రాద్రి జిల్లాలో మరికొంత వినూత్నంగా చేశారు. జిల్లా కేంద్రం నుంచి 40 కిలోమీటర్ల దూరంలో భద్రాచలానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ మహార్యాలీ నిర్వహించారు. ఆ తరువాత గోదావరి వద్దకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. తరువాత అక్కడి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమను రెగ్యులరైజ్ చేసేలా ముఖ్యమంత్రిని కరుణించాలంటూ వేడుకున్నారు. తరువాత రామయ్య విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మరణించిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం అందించేలా సీఎంను దీవించాలని కోరుకున్నారు.